RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 99 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శుక్రవారం 10-4-2026 పేజీలు :8 వెల: 1-00

https://netimanadesam.com/

## మూడు రాజధానులంటూ రుషికొండను మింగారు

– జగన్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన వైఎస్ షర్మిల 2లో

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥అష్టమి రా॥7.33, పూ.షా. ఉ॥8.25, వర్జ్యం సా॥ 5.03 -6.47, దుర్ముహూర్తం ఉ॥ 8.24-9.12, శుభ సమయం ఉ॥ 7.30-9.00, రాహుకాలం ఉ॥10.30-12.00, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

– భారీగా పోలింగ్ శాతం నమోదు

– అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను మిగతా 2లో..



# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

- 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం
- జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి
- విభజన కన్నా జగన్ వల్లనే ఎపి నష్టపోయింది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు
- బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత

**బాపట్ల, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మిగతా 2లో..

# ఈసారి బెంగాల్ అంతటా 'నందిగ్రామ్' ఫలితమే

– హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**హల్దియా, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్‌లోని హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 5ఏళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓటమిని గుర్తు చేస్తూ.. ఈసారి బెంగాల్ అంతటా అదే ఫలితం వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. "బెంగాల్ మార్పును కోరుకుంటోంది. ఈ క్రమంలో భాజపా భారీ విజయాన్ని మనం తప్పకుండా చూస్తాం. నందిగ్రామ్‌లో 5ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు.. భవానీపుర్‌తో పాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుంది. ఇవి సాధారణ ఎన్నికలు కావు. అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయి. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోంది. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోంది. భాజపా అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం. బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు" అని మోదీ మిగతా 2లో..

# మావిగన్ పేరుతో మరో నాటకం

ఇది చెబితేనే జనం నవ్వుకుంటున్నారు... జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



**ఏలూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైసీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. ఉదయం ఏలూరు చేరుకున్న హోం మంత్రికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ, మిగతా 2లో..

# ఏపీ, తెలంగాణ ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయపన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా మరోసారి తెలుగు అధికారికే అవకాశం వచ్చింది. ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా మోరంపూడి అనిల్ కుమార్ ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు తీసుకుంటారు.

# వైఎస్ మరణం వేళ ..సిఎం పదవి కోసం ఎత్తులు

ఆనాడు సంతకాల సేకరణలో జగన్ బిజీ... బొత్స కూడా వైఎస్ మృతిపై అనుమానించారు

ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు... జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయంలో జగన్ ఎక్కడ ఉన్నారో చెప్పాలని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు వైఎస్ ఆచూకీ తెలియక అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం పాకులాడుతారా? అని ప్రశ్నించారు. ఏం జరిగిందో నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాల సేకరణ చేస్తారా? అని విమర్శించారు. అప్పుడు రిలయన్స్ ఏజెన్సీలపై దాడి చేయించారు. మళ్లీ అదే రిలయన్స్‌ను మంచి చేసుకుని రాజ్యసభ స్థానాలిచ్చారు. చాలామంది సీనియర్ నాయకులు అనేక రకాలుగా మాట్లాడారు. వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం మిగతా 2లో..

# వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

- శాంతియుత నిరసనలతో ఖండించాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**చిత్తూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చున్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని మిగతా 2లో..

# ఇంధన కొరత ఆందోళనలు..

– గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు






**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** అమెరికా- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. హర్దీప్ సింగ్ పురీ ఈరోజు, రేపు ఖతార్‌లో పర్యటించనున్నట్లు సంబంధిత శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయన పర్యటనకు సంబంధించి స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. కాగా.. ఇరాన్ ప్రతీకార దాడులకు గురైన గల్ఫ్ దేశాల్లో ఖతార్ కూడా ఒకటి. ఈ దాడుల నేపథ్యంలో ఎల్ఎన్‌జీ ఉత్పత్తి, ఎగుమతులను ఖతార్ అధికారులు నిలిపివేశారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉత్పత్తులను పునఃప్రారంభించాలని అక్కడి అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా పరిమిత కార్యకలాపాలే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హర్దీప్ సింగ్ పురీ ఖతార్‌కు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకొంది.

**యూఏఈకి జైశంకర్..**

భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 11-12 తేదీల్లో జై శంకర్ పర్యటన ఉండనున్నట్లు సంబంధిత శాఖ మిగతా 2లో..

# పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

'శబరిమల' అంశంపై కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10-50 ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది.'శబరిమల ఆలయం సహా మిగతా 2లో..

దేవునియందు, తన ఆత్మయందుగల విశ్వాసం ధర్మం. సందేహించడం పాపం. మనం తలపెట్టిన ప్రతీకార్యంలోను మెచ్చుకొనేవారు కొందరు, తప్పులెన్నేవారు కొందరు ఉంటారు.

## నేటి మనదేశం సంపాదకీయం

# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలిసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శద్ధిచేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హార్మూజ్ జలసంధి తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలు పెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరాన్ నేత ఖమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలూ సాధించలేదని ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీశారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం, చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి... పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురు కోడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలిక సదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజే డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాలంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హోర్ముజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికా విమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురు దాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధంలోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హోర్ముజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు

### సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం ...

### గొల్లపూడి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సందర్శించిన కేంద్రకార్యదర్శి

**విజయవాడ, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ గురువారం గొల్లపూడిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి.. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు, సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం వంటి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణకు అనుసరిస్తున్న విధానాలతో పాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్ - 100 రోజుల ప్రచార కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పోర్టబుల్ ఎక్స్‌రే వ్యవస్థను పరిశీలించారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజలు తేలిగ్గా ఎక్కడెక్కడికో వెళ్లనవసరం లేకుండా తమకు దగ్గర్లోనే పరీక్షలు చేయించుకునేందుకు వీలవుతుంది. అనంతరం నిక్షయ్ మిత్ర చొరవ ద్వారా క్షయ రోగులకు పోషకాహార కిట్లను అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను అనుసంధానం చేస్తూ దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు సత్వర నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 2024, డిసెంబర్‌లో ప్రారంభమైన రెండో విడత ఇంటెన్సి÷డ్ టీబీ ముక్త భారత్ అభియాన్ ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించామని.. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల రేటుతో పోలిస్తే భారత్‌లో టీబీ కేసులు, మరణాల తగ్గుదల రెట్టింపు వేగంతో కొనసాగుతున్నట్లు వివరించారు. డేటా విశ్లేషణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో దేశవ్యాప్తంగా టీబీ ముప్పు అధికంగా ఉన్న 1,58,000 గ్రామాలు, పట్టణ వార్డులను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టీబీ ముక్త్ భారత్ యాప్ - నిక్షయ్ ద్వారా రోగులు, వైద్య నిపుణులకు సరైన మార్గనిర్దేశర అందుతోందని చెప్పారు. ఏఐ చాట్‌బాట్ ద్వారా రోగులకు తక్షణ సహాయం అందించడం జరుగుతోందని.. టీబీ రోగులకు పౌష్టికాహారం, సామాజిక మద్దతు అందించడంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. టీబీని ప్రారంభ దశలోనే గుర్తించి, పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా పౌష్టికాహారం, మానసిక స్థైర్యంతో టీబీపై విజయం సాధించవచ్చని పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సెంట్రల్ టీబీ డివిజన్) రఘురామ్ రావు, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెళ్యేశ్వరి, జేడీ (ఎన్‌టీఈపీ) డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా పదో తరగతి మూల్యాంకనం..

■అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రక్రియ ■కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.

**విజయవాడ, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సజావుగా జరుగుతోందని.. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ గురువారం కేబీఎన్ కళాశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేశారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి జరుగుతున్న మూల్యాంకన ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. మూల్యాంకనంలో పాల్గొన్న ఎగ్జామినర్ల పనితీరును పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా మూల్యాంకన కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా మూల్యాంకన ప్రక్రియ జరిగేలా సూచనలిచ్చారు. మౌలిక వసతులు, భద్రతా చర్యలు, రికార్డుల నిర్వహణ, ట్యాబ్‌ల పనితీరు, మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 6న ప్రారంభమైన ప్రక్రియ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరుగుతోందని, కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ వెంట డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు ఉన్నారు.

# మూడు రాజధానులంటూ రుషికొండను మింగారు

### ఇప్పుడేమో మావిగన్ పేరుతో జోకర్‌గా మారారు

### వైఎస్సార్ పేరు తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు

### జగన్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన వైఎస్ షర్మిల



**అమరావతి, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైఎస్సార్ తన జీవిత కాలం వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా జగన్ మారారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇదేనా వారసత్వం అంటే అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారని సెటైర్లు గుప్పించారు. సంక్షేమానికి సారథి దివంగత నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రతీ పథకం ప్రజల కష్టం, కన్నీళ్ల నుంచి పుట్టిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మా నాన్న వైఎస్సార్ ప్రజాప్రస్థానం తెలుగు ప్రజల గుండెల్లో ఈరోజుకి పదిలమని షర్మిల చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 9, 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం దాక ప్రజాహితమే పరమావధిగా వైఎస్సార్ చేపట్టిన1457 కిలోమీటర్ల పాదయాత్ర సాగిందని తెలిపారు. ఈ పాదయాత్రకు 23 ఏళ్లని చెప్పారు. వారసులమని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పేరును వాడుకున్నారు తప్పితే.. ఆయన ఆశయాలకు వారసులు ఎందుకు కాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీలో నిజంగా వైఎస్సార్ ఐడియాలజీ ఉంటే జగన్ సీఎం అయ్యాక కూడా వైఎస్సార్ జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. 'మాట తప్పం మడమ తిప్పం' అనే వైఎస్సార్ లైన్ వాడుకోవడం తప్పిస్తే, పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు చేశారని షర్మిల ప్రశ్నించారు. వారసులమని చెప్పుకొనే జగన్ కేవలం వైయస్సార్ పేరును మాత్రమే వాడుకున్నారని వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ వారసులు కాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.'వైఎస్ఆర్ వ్యతిరేకించిన భాజపాకి దత్తపుత్రుడిగా ఎందుకు మారారు? ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారు? మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి ప్యాలెస్‌లు కట్టారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలారు. వైయస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే మౌనంగా ఎందుకున్నారని షర్మిల ప్రశ్నించారు.

# వేసవిలో నీటి తొట్టెల ద్వారా పశువులకు తాగునీరు ఏర్పాటు

### - పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు

**విజయవాడ, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక అనుసంధానంతో గ్రామీణ ప్రాంతాలలో నీటి తొట్టెలను నిర్మించి, వేసవిలో పశువులకు తాగునీటి వసతి కల్పించడం జరిగిందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి దామోదర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవి కాలంలో పశువులు, జీవాల నీటి కొరతను అధిగమించడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నీటి తొట్టెలను నిర్మించి త్రాగునీటి వసతి కల్పించామన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం




మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# ఈసారి బెంగాల్ అంతటా 'నందిగ్రామ్' ఫలితమే

వెల్లడించారు. "ఒక్కసారి డబుల్- ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయి. అవి ప్రతిఒక్కరికీ ఉపయోగపడేవే. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నాను.

భాజపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల భయాలను పూర్తిగా తొలగించి నమ్మకాన్ని కలిగించడంతో పాటు చట్టబద్ధమైన పాలనను కొనసాగిస్తాం.

- భాజపా ప్రభుత్వంలో పని చేసే యంత్రాంగం ప్రజలకు కచ్చితంగా జవాబుదారీగా వ్యవహరిస్తుంది.
- అన్యాయం జరిగిన ఆడబిడ్డల కేసులను రీఓపెన్ చేస్తాం. అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతాం.
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలు, అవినీతి చేసిన వారందరినీ జైలుకు పంపిస్తాం. అది మంత్రులైనా, వారి వాచ్‌మెన్‌లైనా సరే..
- శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కలిగిస్తాం. కానీ చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతాం.
- ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తాం" అని హామీ ఇచ్చారు.

# పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈసందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు. "మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. కాబట్టి ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

# ఇంధన కొరత ఆందోళనలు..

పేర్కొంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో.. భారత్‌లో ఇటీవల ఎల్ఎన్‌జీ కొరతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. అయితే, కేంద్రం ఈ ఆందోళనలను కొట్టిపారేసింది. దేశంలో తగినన్ని నిల్వలు ఉన్నాయని, కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారాలు నిరాధారమైనవని స్పష్టం చేసింది.

# మావిగన్ పేరుతో మరో నాటకం

గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 72 లక్షలతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని అనిత ప్రారంభించారు. ఆపై పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు.

# వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# వైఎస్ మరణం వేళ ..సీఎం పదవి కోసం ఎత్తులు

ఉందని సాక్షాత్తూ బొత్సనే మాట్లాడారు. సభ్య సమాజంలో ఎవరూ ఇలాంటి పనులు చేయరని అనుకున్నాం. ఒక సైకోకు పదవీ వ్యామోహం వస్తే.. ఆ పదవి కోసం ఏమైనా చేస్తారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మలచుకుని ఎలా ప్రవర్తించారో చూశాం. తండ్రి మరణం నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు ఎలా సేకరించారో చూశాం అని అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంపై జగన్‌కు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఎన్డీఏపై అచంచల విశ్వాసంతో ప్రజలు అధికారం ఇచ్చారని తెలిపారు. 22 నెలల్లోనే కేంద్రం సాయంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని చెప్పారు. 2004లో రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యారని... నాడు వారి ఆర్థిక పరిస్థితి ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌ను జగన్ మానసిక క్షోభకు గురిచేసినట్లు చెప్పారు. వైఎస్ చనిపోయినప్పుడు జగన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు.

# చంద్రగిరి పోలీస్ స్టేషన్ ముందు వైఎస్ఆర్‌సీపీ నిరసన

- పత్రికాధిపతిపై కేసు నమోదు చేయాలని డిమాండ్
- మహిళలను అగౌర పరిచేలా ప్రసారాలు చేయడం తగదు
- వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



**చంద్రగిరి,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆందోళన చేపట్టారు. నియోజక వర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం నిరసన చేపట్టారు. పత్రికాధిపతిపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్యంగా మహిళలను కించపరిచేలా తన ఛానల్‌లో ప్రసారాలు చేస్తున్నారని ఆరోపించారు. సమాజహితం కోసం పని చేయాల్సిన మీడియా సంస్థలు ఒక రాజకీయ పార్టీకి తొత్తుగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. టీవీ5 ఛైర్మన్ బీఆర్ నాయుడుకు టీటీడీ ఛైర్మన్ పదవి లభించడంపై అసంతృప్తితో పత్రికాధిపతి అమాయక మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రసారాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఆయనకు అనుకూలంగా వార్తలు ప్రసారం చేసినప్పటికీ ఆయనకు కాకుండా బీఆర్ నాయుడుకు టీటీడీ ఛైర్మన్ బాధ్యతలు ఇవ్వడం, ఇప్పుడు ఆ పదవి కోసం చంద్రబాబును మెప్పించేందుకు ఇలాంటి కథనాలు ప్రసారం చేస్తున్నారా ? అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాల్సిన మీడియాను అడ్డుపెట్టుకుని వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు చంద్రగిరి పోలీస్ స్టేషన్ ముందు వైఎస్ఆర్‌సీపీ నేతలు నిలబడి ఆ పత్రికాధిపతికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి సీఐ సురేష్ కుమార్‌కు ఫిర్యాదు అందజేశారు. ఇదే అంశంపై చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి కూడా మరో ఫిర్యాదు అందించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీకి చెందిన పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రా వారిపాళెం, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన జీవోపై పునరాలోచించాలి

**సూళ్లూరుపేట , ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశంలోని దళిత క్రైస్తవులపై మార్చి 24వ తేదీ సుప్రీంకోర్టు ఇచ్చిన జీఓ పై పునరాలోచించాలని పాస్టర్ కుమార్ తెలియ జేశారు. దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే బీసీలుగా పరిగణించాలని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై రాజకీయ నాయకులు ప్రముఖ విశ్లేషకులు ఈ జీవోను ఖండించాలని దళితుల హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని తెలిపారు. రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. దేశంలోని ప్రజలు సర్వమత సమ్మేళనంగా అన్నదమ్ములలాగా కలిసి జీవిస్తున్నామని దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన జీవోపై పునరాలోచించాలని పాస్టర్ ఎస్.కుమార్ తెలిపారు.

# దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



**సత్యవేడు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు నియోజకవర్గం లో దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఇళ్ళులేని ఎస్సీ లకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు.గురువారం తిరుపతి కి విచ్చేసిన ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్ కు ,నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్,తో కలిసి ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ , నియోజకవర్గంలో బుచ్చి నాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో దళితులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు ఎత్తివేసి దళితులకు న్యాయం చేసే విధంగా కలెక్టర్, ఎస్పీలకు సూచించి బాధితులకు న్యాయం చేయాలని మెమొరాండం సమర్పించారు. ఎన్టీఆర్ గృహ కల్ప పథకం కింద పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

## నాయుడుపేటలో పెచ్చు మీరుతున్న చైన్ స్నాచర్స్ ఆగడాలు

- శ్రీరామ్ నగర్‌లో మహిళ మేడలో చైన్ చోరీ



**నాయుడుపేట, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో చైన్ స్నాచర్స్ ఆగడాలు రోజురోజుకూ పెచ్చు మీరుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం శ్రీరామ్ నగర్ లోని ఓ దుకాణం యజమాని గిరిజమ్మ మెడలో నాలుగు సవర్ల బంగారు సరుడు చోరీ చేసి బైక్ పై పరారయ్యారు. శ్రీరామ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న గిరిజమ్మ తన ఇంటి ముందు చిన్న అంగడి నిర్వహిస్తోంది. గుర్తు తెలియని దుండగులు మోటార్ బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి వాటర్ ప్యాకెట్ కావాలని అడిగారు. వాటర్ ప్యాకెట్లు అమ్మడం లేదని ఆమె చెప్పడంతో చాక్లెట్ కావాలని అడిగారు. ఆమె చాక్లెట్ ఇస్తుండగా ఆగంతకులు మెరుపు వేగంతో ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు సరుడు లాక్కొని పరారయ్యారు. గిరిజమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలో పట్టపగలు చైన్స్ స్నాచర్స్ మహిళ మెడలో చైన్లు లాకెళ్లిపోవడంతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు గస్తీ నిర్వహించే చైన్ స్నాచర్స్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం

- ప్రతిభకు పురస్కారం.. కష్టానికి గుర్తింపు!
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులకు సన్మానం

**నాయుడుపేట, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 43వ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థుల కోలాహలం, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా 2025-26 విద్యా సంవత్సరంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సాధించిన విజయాలను పొందుపరుస్తూ రూపొందించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కళాశాల సాధించిన ప్రగతిని, విద్యార్థుల ప్రతిభను ఈ పుస్తకం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పడం విశేషం. ముఖ్య అతిథి పెసల జయరాజగోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను అభినందనం దించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సి. విజయకుమార్ అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు కట్ట సుధాకర్ రెడ్డి, ఎం. రామచంద్ర రెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత్ రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, రోటరీ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలి

- కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సిబ్బందిని ఆదేశించారు.గురువారం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.క్యాంటీన్ లో సాయంత్రం భోజనం చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చేవారికి నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే తీసుకోవాలని సూచించారు.క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు.

# విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయం ప్రారంభం



**సూళ్లూరుపేట,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశంలోఎక్కడ లేని విధంగా మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి నియోజకవర్గానికి సంబంధించి శాసనసభ్యులకు ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని కేటాయించడంపై ఎమ్మెల్యే విజయశ్రీ హర్షం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యాలయంలో ముఖ్యంగా నియోజకవర్గంలో అన్ని అంశాలపై స్వర్ణాంధ్రలో భాగంగా 10 సూత్రాలకు అనుగుణంగా ఈ యూనిట్ పనిచేస్తుందని, ప్రతి అధికారి పనితీరు , ప్రతి సామాన్యుడి ఫిర్యాదుకు ఒక జవాబుదారీ తనం తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో సహాయం చేస్తుందని ఎమ్మెల్యే విజయశ్రీ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రాజశేఖర్, యంగ్ ప్రొఫెషనల్ మురళీకృష్ణ, , కార్యాలయ సిబ్బంది, నియోజకవర్గ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేతులపై... నిర్లక్ష్యపు హేతువు



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సువర్ణముఖి నదిపై ఉన్న వంతెనల గోడలపై మొక్కలు నానాటికి పెరిగి పోతున్నాయి. వీటిని ఇలానే వదిలేస్తే పగుళ్లు ఏర్పడి వంతెనల ప్రతిష్టత ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

## కోటారెడ్డి నర్సింగ్ హోమ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కందుకూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని కోటారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ వివై కోటారెడ్డి నుంచి డాక్టర్ శివ కుమార్ రెడ్డి, డాక్టర్ సాకేత్ మూడు తరాల జనరేషన్ ప్రజలకు సేవలు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలో 1200 మందికి సహాయం అందించామని, 10 కోట్ల రూపాయలు మంజూరు చేసి ముఖ్యమంత్రి పెద్ద మనసు చాటుకున్నారన్నారు. త్వరలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఇన్సూరెన్స్ పాలసీలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాబోతోందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కార్పొరేట్ స్థాయి ల్యాబరేటరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. డాక్టర్ సాకేత్ మాట్లాడుతూ... తమ హాస్పిటల్ లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధునిక టెక్నాలజీతో వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు లేకపోయినప్పటికీ తమకున్న రేషన్ కార్డు ద్వారా ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నేతలు ఉన్నం వీరాస్వామి, అల్లం వెంకటేశ్వర్లు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, కంద్రా మాల్యాద్రి, కొచ్చెర్ల శ్రీను పాల్గొన్నారు.

## నేటి నుండి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు

**తిరుపతి,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో 10వ తేదీ శుక్రవారం నుండి తిరుపతి అర్బన్ ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ (పింక్ బస్) వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. స్విమ్స్ డైరెక్టర్/ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్/పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాలు జరగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విలేజ్ హెల్త్ సెంటర్లలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది.పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపునకు వచ్చేవారు ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తీసుకురావాల్సి ఉంటుంది. తిరుపతి అర్బన్ లో మొదటగా 10న ఐఎస్ మహల్ సచివాలయం. 13న చిన్నబజారు వీధి . 17న రాజన్న పార్కు, 21న గిరిపురం, 24న పద్మావతి పార్కులో క్యాంపులు నిర్వహిస్తారు.

# తిరుపతి జిల్లా

## అసలే ఇరుకు వీధులు.. ఆపై రోడ్డుపై వ్యాపారాలు



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అసలే ఇరుకు వీధులు ఒక వాహనం ఎదురు వస్తే మరో వాహనం నిలిచి రావాల్సిన పరిస్థితి అక్కడ ఏర్పడింది. ఈ మార్గంలో ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి వీధిలో రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తూ తరచూ ట్రాఫికు ఇబ్బందులు కలిగిస్తున్నారు. వెంకటగిరి బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిలో ప్రభుత్వ పాఠశాలతో పాటు వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసి ఉన్నారు. రోడ్లపైనే విచ్చల విడిగా తోపుడు బండ్లు తో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అసలే ఇరుకైన ఈ రహదారిలో వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో ప్రజలతోపాటు వాహనదారులు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి ఏర్పడింది. వెంకటగిరి బస్టాండ్ లో సాయంత్రం అయితే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మోటార్ సైకిళ్లు, ఆర్టీసీ బస్సులు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అటుగా వెళ్లే పాదాచార్యులు సైతం ట్రాఫిక్ సమస్యతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంకటగిరి బస్టాండ్ వద్ద ఉన్న హోటల్స్, పండ్ల వ్యాపారాల దుకాణాల ను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## వృధా.. తప్పని వెత



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో ట్రాఫిక్ నిర్వహణ కోసం దాదాపు ఐదేళ్లకు పైగా సిగ్నల్ దీపాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఇక్కడ అన్ని వీధులు లేకపోవడం వాహనాల రాకపోకల పరిస్థితులు సిగ్నల్ దీపాలతో నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా వీటిని వినియోగించలేదు.

**ఏళ్లుగా వృధాగా:**

పట్టణంలోని పెళ్లి మండపం, కృష్ణారెడ్డి మండపం కూడళ్ల లో ఏర్పాటుచేసిన సిగ్నల్ దీపాలు ఏళ్లుగా ఉపయోగంలో లేవు. వీటి కారణంగా అడ్డం తప్ప ఒనగూరే ప్రయోజనం శూన్యం, గతంలో పోలీసు అధికారులు వీటిని తొలగించేందుకు నిర్ణయించి విరమించుకున్నారు.

**తుప్పు పట్టి.. ప్రమాదకరంగా:**

ప్రస్తుతం పలు సిగ్నల్ దీపాలు అడుగు భాగంలో తుప్పుపట్టాయి. భారీ వాహనాలు తగిలిన, బలమైన గాలులు వీచినా పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలతో ఇబ్బందులు తప్పవు. వీటి ద్వారా ప్రమాదాలు తలెత్తక మునుపే తొలగిస్తే ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంటుంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## స్పెషల్ ఆఫీసర్‌కి సత్కారం



**రామచంద్రపురం,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని సికె పల్లి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా మండల విద్యాశాఖ అధికారి మార్కొండ నాయుడుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ నియమించారు. ఏప్రిల్ రెండవ తేదీతో సర్పంచులు పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. బుధవారం స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ వి. మార్కండేయ నాయుడుని, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, వేసవికాలం ప్రారంభం అవడంతో ముఖ్యంగా పంచాయతీ గ్రామాలలో త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య లేకుండా చేస్తానన్నారు. పంచాయతీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్, పంచాయతీ సెక్రటరీ శిరీష, కూటమి నాయకులు బి. కోటేశ్వర్ రెడ్డి,బి. రామకృష్ణారెడ్డి, ఎస్ ప్రభాకర్, కుప్పారెడ్డి, బాబయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ బాధ్యతల స్వీకరణ



**సత్యవేడు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా సత్యవేడు నూతన తహసిల్దార్‌గా శివప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన వినతులను పరిష్కరించడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఆయన తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెవిన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూస్తానన్నారు. సమస్యల పరిష్కార విషయంలో ప్రజలు కూడా తగిన డాక్యుమెంట్లు సమర్పించాలన్నారు.భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక రకాల సేవలు అందుబాటులో ఉన్నట్టు ఆయన గుర్తు చేశారు. ఇందులో భాగమే కులం, ఆదాయం, స్థానికం, వన్ బి, అడంగల్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం వంటివి సులువుగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని అన్నారు. దీనికోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పని లేదన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి ప్రతి సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామన్నారు. ఇక్కడ తహసిల్దార్‌గా పనిచేసిన రాజశేఖర్ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్ కు బదిలీ కాగా, కలెక్టరేట్ జి. సెక్షన్లో సూపర్డెంట్గా పని చేస్తున్న శివప్రసాద్ డిప్యుటేషన్‌పై తహసీల్దారుగా బదిలీ కావడంతో బాధ్యతలు స్వీకరించారు.

## దామరమడుగులో క్రీడా సందడి

- విపిఆర్ ఫౌండేషన్ క్రికెట్ పోటీలను సందర్శించిన సిఐ. సుధాకర్ రెడ్డి



**నెల్లూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని VPR ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ మూడో రోజు ఉత్సాహంగా కొనసాగింది. డాక్టర్ అర్జున్ రెడ్డి యూత్ నేతృత్వంలో జరుగుతున్న ఈ పోటీలను కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి పాలెం అగ్రికల్చర్ క్రెడిట్ బ్యాంక్ ఛైర్మన్ ఏటూరి శివరామ కృష్ణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. గ్రామీణ యువత కోసం భారీ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి , ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సేవా, ధార్మిక కార్యక్రమాలతో పాటు యువతను ప్రోత్సహించే కార్యక్రమాలలో ముందు ఉంటారని అభినందించారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని జట్లను ఆహ్వానించి ఈ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించి, వారికి సరైన వేదికను కల్పించినందుకు స్థానిక క్రీడాకారులు , గ్రామస్తులు ఫౌండేషన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అర్జున్ రెడ్డి యూత్ సభ్యులు, స్థానిక నాయకులు , పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**కడప, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యువతకు విద్యతో పాటు పని అనుభవం కల్పించేందుకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (ఫేజ్-3)ను ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి సి విజయ వినీల్ కుమార్ తెలిపారు. ఈ పథకానికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు . పదో తరగతి, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.12 లక్షల లోపు ఉండాలని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు mca.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. వివరాల కోసం 6300125455 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ఆడపిల్లల చదువు హక్కు మాత్రమే కాదు
# సమాజాభివృద్ధి దిశగా మేలి పునాది

**- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**- డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నూతన భవనాల ప్రారంభోత్సవం - మహిళా విద్యే సమాజాభివృద్ధికి మూలం - జిల్లా కలెక్టర్**

**చిత్తూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆడపిల్లలకు చదువు హక్కు మాత్రమే కాదని, సమాజాభివృద్ధికి మేలి పునాది అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. విద్యావంతు లైన మహిళ సమాజానికి, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 44 వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన, కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, డాక్టర్ కలికిరి మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలకు వెంకయ్య నాయుడు అభినందనలు తెలియజేశారు. మహిళా విద్య ద్వారానే మహిళా సాధికారతతో శిశుమరణాల తగ్గుదల, కుటుంబ ఆరోగ్యం మెరుగు, పిల్లల పోషణ, విద్యా పరమైన అవకాశాల మీద సానుకూల ప్రభావం ఏర్పడుతుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సరైన అవకాశాలు కల్పించి గౌరవించినప్పుడే సౌభాగ్యం వెల్లివిరుస్తుందన్న వెంకయ్యనాయుడు తెలిపారు. మహిళా సాధికారత విషయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి చేసిన కృషిని,





ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం బాలికలకు చదువుతో పాటు, అనేక విషయాల్లో ప్రోత్సాహం, తగిన గుర్తింపు ఇచ్చే దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ 2016 లో ముస్సోరీలో ట్రైనింగ్ పూర్తి అయిన అనంతరం అప్పటి ఉప రాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు తమ బ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన సందర్భాన్ని స్మరించుకున్నారు. ఆయన ఇచ్చిన మార్గదర్శక సూచనలు ఇప్పటికీ తనను ప్రేరేపిస్తున్నాయని పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గ శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ బీసీ హాస్టల్ నూతన భవన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉప రాష్ట్రపతికి, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్పి వెంకటేశ్వరచౌదరి చేపట్టిన బీసీ హాస్టల్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ఈ కొత్త భవనం విద్యార్థులకు మెరుగైన వసతులు అందిస్తుందన్నారు. హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్ మాట్లాడుతూ మాజీ ఉప రాష్ట్రపతికి తొలుత ధన్యవాదాలు తెలిపారు. వెంకటేశ్వరచౌదరి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రతి కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తూ నిధుల పారదర్శక వినియోగానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎన్పి వెంకటేశ్వరచౌదరి మాట్లాడుతూ మాజీ ఉప రాష్ట్రపతి రాక పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సహాయం, సహకారం ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కళాశాల పురోగతికి, గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు మంచి అవకాశాలు సమకూర్చి సమాజ అభివృద్ధికి తోడ్పడే విధంగా బాలికలను తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థినిలకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో చూడ చైర్పర్సన్ కటారి హేమలత, రాజ్యసభ మాజీ సభ్యురాలు దుర్గారామకృష్ణ, సిపిడిసి మెంబర్ శైలజ తేజోమూర్తి, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి మద్దిపట్ల వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే మనోహర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి ఉషారాణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా

## నాణ్యమైన ప్రజాస్వామ్యం కోసం మహిళలు ఉద్యమించాలి



**పలమనేరు , ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశంలో నాణ్యమైన ప్రజాస్వామ్యం కోసం మహిళలు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు న్యాయవాది బహుజనుల ఉద్యమ నేత ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుణ్యమూర్తి చింతమాకుల పిలుపునిచ్చారు. గురువారం గంగవరం సమీపంలోని ఫంక్షన్ హాల్లో జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి .మునిరత్నం, గౌరవ అధ్యక్షులు మణి ఆధ్వర్యంలో మహిళా అధ్యక్షురాలు సరస్వతి అధ్యక్షతన నాణ్యమైన ప్రజాస్వామ్య స్థాపన బహుజన మహిళల పాత్ర అనే అంశంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశంలో నాణ్యమైన ప్రజాస్వామ్యం లేదని, పాలకులు స్వార్ధ ప్రయోజనాల కోసం పాకలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంతో పాటు హక్కులు, చట్టాలను కాపాడుకోవడానికి మహిళలు సమిష్టిగా ఉద్యమించాల న్నారు. మహిళలకు చట్టాలు, హక్కులు ఉన్నప్పటికీ వాటిని అందించడంలో పాలకులు పూర్తికు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తున్నారని, దుర్మార్గమైన చర్యలను ఎండ కట్టాలంటే గ్రామస్థాయి నుండి సంఘాలను ప్రతిష్ట పరచాలని కోరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన సమక్షంలో జాతీయ మానవ హక్కుల సంస్థ పలమనేరు నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా పలమనేరు రూరల్ మండలం పెంగరగుంట పంచాయతీకి చేరిన జంగాలపల్లి ఎస్.మధును ఎంపిక చేశారు. మధు మాట్లాడుతూ.... నాపై నమ్మకముతో ప్రజా సమస్యలతో పాటు వారి హక్కులను కాపాడడానికి ఉన్నతమైన బాధ్యతను తనకు అప్ప చెప్పినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు.

## ప్రాంగణ ఎంపికలో విద్యార్థులకు ఉద్యోగాలు




**పలమనేరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని సాయి నగర్‌లోని ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ సౌజన్యంతో జరిగిన ప్రాంగణ ఎంపిక లో గురువారం రాడికల్ మైండ్స్ సంస్థ కు 26 మంది టాటా గ్రూప్స్ 7 మంది ఎస్బీఏ కి 24 మంది ఆల్ సెట్ సంస్థకు 20 మంది ఏడి ఇ.సి.సి.ఓ 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎం.వి.ఆర్ రెడ్డి తెలియజేశారు. వారికి 1.8 లక్షల నుండి 2.8 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందన్నారు ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధా ఆధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

## రైతు బాంధవుడు ముఖ్యమంత్రి

**- మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి**



**రామకుప్పం , ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతు దేశానికి వెన్నుముక అని రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి రైతు బాంధవుడుగా నిలిచాడని రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని 90 బంధార్లపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తున్న యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, బూత్ ఇన్చార్జిలు నరేష్, బాలు, రైతు విభాగ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, ముఖ్య నేతలు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రబాబు, ఆనందప్ప, వెంకటరెడ్డి, ఆనంద్భాప, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరికృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాయకులు సిఫార్సు చేసిన వారికే సదరం సర్టిఫికెట్లు

**- వైసిపి దివ్యాంగుల విభాగం అధ్యక్షులు దుర్గారెడ్డి ఆరోపణ**



**చిత్తూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి పార్టీల నాయకులు సిఫార్సు చేసిన వారికే సదరం సర్టిఫికెట్ల జారీలో ప్రాధాన్యత ఇస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులిపాటి దుర్గారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్ అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఉద్దేశించి దుర్గారెడ్డి, జోన్ 4 అధ్యక్షులు ఆవుల నాగేంద్ర జిల్లా అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్ మాట్లాడారు. సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరుతో లక్షలాది మంది దివ్యాంగులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున కొత్తగా పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్, అందుకు విరుద్ధంగా ఉన్న పెన్షన్లనే రద్దు చేస్తూ దివ్యాంగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్న వారికే కూటమి నాయకులు సదరం సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది డిసెంబర్ 3 వ తేదీన జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఇంద్రధనస్సు పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగులకు 7 వరాలను ఇచ్చారని, వాటిలో ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన 6 వరాల అమలు మాటేమిటని ప్రశ్నించారు. తూతు మంత్రంగా దివ్యాంగ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలుపరుస్తున్న ప్రభుత్వం బస్సుల్లో దివ్యాంగులకు సీట్ల కోటాను పెంచడంలో విఫలమైందన్నారు. స్త్రీ శక్తి, మహిళా శక్తి అంటూ బాజాయింపు వేసుకునే ప్రభుత్వానికి ఒక తెలుగు దినపత్రిక యజమాని వంత పాడుతూ మహిళా సమాజాన్ని అవమానపరిచేలా మాట్లాడడం దారుణమన్నారు. స్థాయికి మించి మాజీ ముఖ్యమంత్రి జగన్ పై సోషల్ మీడియాలో పోస్టింగులు పెడుతున్న వారికి, ఆయన పేరెత్తే అర్హత లేదన్నారు. సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జోన్ - 4 అధ్యక్షులు ఆవుల నాగేంద్ర, న్యాయ విభాగం జిల్లా ప్రతినిధి దివాకర్ రెడ్డితో పాటు పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలను ప్రోత్సహిస్తూ... మేము సైతం అంటున్న దాతలు



**పులిచెర్ల, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న ఆరోగ్య సేవల పట్ల సంతృప్తి చెంది, సిబ్బందిని ప్రోత్సహిస్తు త్వరలో ప్రారంభం కానున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల మెరుగైన వైద్య సేవల కొరకు ఎర్రపాపిరెడ్డి గారి పల్లె వాస్తవ్యులు మూరే శ్రీనాధరెడ్డి సుమారు 45 వేల రూపాయలు విలువైన రెండు పెద్ద ఆక్సిజన్ సిలిండర్లు, సంబంధిత పరికరాలు అందజేసినట్లు వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇంకా అరవవాండ్ల పల్లె వాస్తవ్యులు సూరినేని సుబ్రమణ్యం నాయుడు సుమారు 25 వేల రూపాయలు విలువైన రెండు పేషంట్ మానిటర్లు, ఆసుపత్రి అభివృద్ధి కొరకు శ్రీనివాసులు 25 వేల రూపాయలు, కొత్తపేట నివాసి రాజానాయుడు వారి ధర్మపత్ని కీర్తిశేషురాలు రెడ్డెమ్మ గారి జ్ఞాపకార్థం 13 వేల రూపాయలు, గడ్డం వారి పల్లె వాస్తవ్యులు సుధాకర్ రెడ్డి పది వేల రూపాయలు, యల్లంపల్లె నివాసి మర్రిపాడు చౌడప్ప వెయ్యి రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారందరికీ ధన్యవాదాలు తెలిపిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పేద మరియు అవసరమైన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నామని, ఆధునిక వైద్య పరికరాలు మరియు ఇతర సదుపాయాలు కల్పించి గ్రామీణ పేదప్రజలకు ఉన్నత స్థాయి వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అపర్ణ, పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రమీల, పురుషోత్తం మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- రాష్ట్ర బార్ అసోసియేషన్ నూతన సభ్యులు శ్రీనివాసరాజు హామీ**




**చిత్తూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బార్ అసోసియేషన్ నూతన సభ్యులు ఉప్పలపాటి శ్రీనివాసరాజు హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 8వ స్థానంలో సభ్యునిగా విజయం సాధించిన ఉప్పలపాటి శ్రీనివాసరాజుకు గురువారం సాయంత్రం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సన్మానం జరిగింది. చిత్తూరు నగరానికి చెందిన న్యాయవాదులు జయకుమార్, గిరిధశర్మ, ఇతర న్యాయవాదులు భారతీయ జనతా పార్టీ నాయకులు శ్రీనివాసరాజుకు దుస్సాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులపై దాడులు జరగడం, దాడులను తిప్పి కొట్టేందుకు సరైన చట్టాలు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో తాను కేంద్ర ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల సహాయ సహకారాలు తీసుకొని న్యాయవాదులకు తెలంగాణ రాష్ట్రం తరహాలో న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్ ను ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఆరోగ్య బీమా సౌకర్యం, ఇళ్ల స్థలాల మంజూరు, న్యాయమిత్ర పథకం అమలు అంశాలను అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. న్యాయవాదులు పదవీ విరమణ పొందిన తరువాత కాకుండా వారి వయోపరిమితి 60, 70, 80 వ సంవత్సరాలలో కొంత మొత్తం నగదును పెన్షన్ రూపంలో చెల్లిస్తే, వారి కుటుంబాలకు బాసటగా ఉంటుందన్నారు. ఈ అంశాన్ని సైతం తాను రాష్ట్ర బార్ అసోసియేషన్, రాష్ట్ర హైకోర్టు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల కుటుంబ తగాదాల కారణంగా పీలేరు పట్టణంలో హత్యకు గురైన న్యాయవాది ఎల్లయ్య కుటుంబ సభ్యులకు ఆయన తన సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చిట్టిబాబు, పోతపాల రామమూర్తి, తోటపాళ్యం వెంకటేష్, విజయశేఖర్, రెడ్డిమస్తాన్, ఢిల్లీరాణి పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం

**పలమనేరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు పట్టణంలో గల కాకా తోపు, యు పి ఎస్ సి లో గురువారం ఘనంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసిడిఎస్, సూపర్వైజర్ నజ్మా తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐ సి డి ఎస్, సి డి పి ఓ ఉమా రాణి ముఖ్య అతిథిగా హాజరై పోషణ్ పక్వాడాకు సంబం ధించిన పోస్టర్లను ఆమె చేతుల మీదుగా విడుదల చేశారు. సిడిపి ఓ, ఉమా రాణి మాట్లాడుతూ జీవితంలో మొదట ఆరు సంవత్సరాల పిల్లల మెదడు పూర్తిస్థాయిలో అభివృద్ధి ఎలా జరుగుతుందనే విషయంపై క్లుప్తంగా వివరించారు. వెయ్యి రోజుల సంరక్షణ గురించి ప్యాక్ చేసిన పదార్థాలు ద్వారా కలిగే నష్టాలు, పిల్లలను స్క్రీనింగ్ వస్తువులకు దూరంగా ఉంచడం పై తల్లిదండ్రులు శ్రద్ధ చూపా లన్నారు. ప్రతి ఒక్కరూ చక్కెర వాడడం తగ్గిస్తే అనారోగ్య సమస్యలు నుండి మనం బయటపడడానికి అవకాశం ఉందన్నారు. సూపర్వైజర్ నజ్మా మాట్లాడుతూ... పిల్లలకు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికా హారాన్ని అందించాలని, దీంతో బిడ్డలు బలవంతులుగా, ఆరోగ్యవం తులుగా ఉంటారన్నారు. మెడికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, వైద్య సబ్ యూనిట్ అధికారి జయశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, పెద్దవారు, వృద్ధులు ఎక్కువగా ఎండలో తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఎండను దృష్టిలో పెట్టుకొని మీ దగ్గరలోని ఆశ ,ఏఎన్ఎం, డాక్టర్లను ఎప్పటికప్పుడు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ, ఏఎన్ఎంలు, అంగన్వాడి వర్కర్లు స్థానికులు పాల్గొన్నారు.

## బీసీ ధర్మ దీక్షకు మద్దతుగా రెండవ రోజు రిలే నిరాహార దీక్ష

**పుంగనూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ముడెప్ప సర్కిలందు గురువారం బి సి వై పార్టీ నాయకులు బీసీ ధర్మదీక్షకు మద్దతుగా రెండవ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బోడె రామచంద్ర యాదవ్ చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షకు ప్రజల్లో విస్తృత మద్దతు సమీకరించడమే ఈ రిలే నిరాహార దీక్ష ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి మద్దతును కూడగట్టేందుకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఈ నెల 11వ తేదీన చేపట్టనున్న బీసీ ధర్మ దీక్ష ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం బీసీవై పార్టీ ఐదు ప్రధాన డిమాండ్లని నెరవేర్చాలనిబీసీ రక్షణ చట్టం అమలు , రాజధాని ప్రాంతంలో బీసీలకు భూమి కేటాయింపు, బీసీ కులాల కార్పోరేషన్లకు తగిన నిధుల కేటాయింపు, సమగ్ర కుల గణన నిర్వహణ, విద్య ఉద్యోగాలు స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పంచాలని మార్చి 31లోగా అమలుకానీ పక్షంలో ఏప్రిల్11న బీసీ వై పార్టీ అధినేత చేపట్టనున్న ఆమర నిరాహార దీక్షలో పెద్ద ఎత్తున బిసి లు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర పిఎసి కమిటీ సభ్యులు పాల రమేష్ యాదవ్, పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ హరి బాబు యాదవ్, అన్నమయ్య జిల్లా యూత్ కో-కన్వీనర్ ఉత్తన్న, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాంబ మూర్తి, సోషల్ మీడియా అధ్యక్షులు గిరిబాబు కుమ్మర, వెంకటేష్ యాదవ్, స్వాతి ప్రసాద్, శంకర, గంగరాజు, చలపతి, నాగరాజు, గణేష్,జ్ఞానేంద్ర, గౌడ పాల్గొన్నారు.

## వెంకయ్య నాయుడును కలిసిన ముద్దు కృష్ణంరాజు



**పుంగనూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీజేపీ సీనియర్ నాయకులు, పట్టణ బీజేపీ అధ్యక్షులు యం.జగదీష్ రాజు, తాత గారైన యం. ముద్దు కృష్ణంరాజు గురువారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ను చిత్తూరు ఎన్ పి సి కన్వెన్షన్ హాల్లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ముద్దుకృష్ణమ రాజుతో మాట్లాడడం తనకు సంతోషాన్నిచ్చిందని అన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం



**పుంగనూరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని కోర్ట్ ఆవరణంలో బార్ కౌన్సిల్ మెంబర్ గా ఎంపికైన ఉప్పలపాటి శ్రీనివాసరాజు ను బార్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో భాగంగా ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ లో చర్చిస్తానని ముఖ్యంగా న్యాయవాదుల సంక్షేమానికి అవసరమైన హెల్త్ ఇన్సూరెన్స్ గురించి , పుంగనూరు న్యాయస్థానంలో జడ్జిల నియామకం గురించి ఏపీ హైకోర్టు బార్‌లో చర్చిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మంచాల విజయ్ కుమార్, కార్యదర్శి అరవింద కుమార్,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గురుమూర్తి, న్యాయవాదులు బాలాజీ, కుమార్ ,శైలేంద్ర కుమార్, శివప్ప నాయుడు, ఎల్ వి రమణ ,వీర మోహన్ రెడ్డి, తోట గిరిధర్ ,శరత్ కుమార్, విజయ శంకర్ ,కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా తెట్టు శ్రీ పాలేటి గంగమ్మ జాతర ముగింపు

**- ఆలయ కమిటీ చైర్మన్ పూజారి అంజి వెల్లడి**



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెట్టు గ్రామంలో వెలిసిన శ్రీ పాలేటి గంగమ్మ తల్లి జాతర ఏప్రిల్ 6 తేదీ బోనాలతో ప్రారంభమై 7 తేదీ రాత్రి తిరుణాల , 8 వ తేదీ పగలు తిరుణాలతో వైభవంగా ముగిసింది. కోరిన కోరికలు తీర్చే పాలేటి గంగమ్మ జాతరకు విద్యుత్ అలంకరణలతో 36 చాందిని బండ్ల ను వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకువచ్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, చెక్కభజనలు, భక్తులకు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పూజారి అంజి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు భక్తులకు అన్నసంతర్పణ చేయడం జరిగిందన్నారు. అమ్మవారి జాతర విజయవంతం చేసిన భక్తులు, పాత్రికేయులు , రెవిన్యూ సిబ్బంది, మండల అధికార యంత్రాంగానికి ఎలక్ట్రిసిటీ డిపార్టు మెంటు వారికి, పంచాయితీ, గ్రామ సచివాలయ సిబ్బంది, హెల్త్ డిపార్టు మెంటు , పోలీస్ శాఖ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 13న సంత, మార్కెట్ బహిరంగ వేలం

**రామసముద్రం, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 13న ఉదయం 11 గంటలకు వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్ గేటుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు సంతకు రూ.1.10 లక్షలు, బస్టాండ్‌కు రూ.1 లక్ష, దినసరి మార్కెట్‌కు రూ.1 లక్ష డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్చు పాటదారుడు వేలం అనంతరం మిగిలిన మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పంచాయతీ బాకీలు లేని వారికే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. వేలం హక్కు 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు వర్తిస్తుందని తెలిపారు.

## 12న మోడల్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష

**రామసముద్రం, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం దిన్నెపల్లి సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 12న 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రానికి కనీసం అరగంట ముందే హాజరు కావాలన్నారు. పరీక్ష సమయంలో నియమాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. పాఠశాలకు మొత్తం 154 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**రామసముద్రం, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం పోలీస్ స్టేషన్‌ను మదనపల్లి రూరల్ సీఐ రవి నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు 108కు కాల్ చేయాలని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందుతుందని పేర్కొన్నారు. పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, వేసవిలో ఈతలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ములకలచెరువు ఎస్ఐగా ఉమామహేశ్వర్ రెడ్డి



**ములకలచెరువు,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ములకలచెరువు మండల సబ్ ఇన్స్పెక్టర్‌గా ఉమామహేశ్వర్ రెడ్డి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న ఎస్ఐ ప్రతాప్ కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో రామసముద్రం మండలంలో ఎస్.ఐ. పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడతానని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, పేకాట, కోళ్ల పందాలు, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడుగా సోమశేఖర్



**ములకలచెరువు,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ములకలచెరువు మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్ పి ఓ) అధ్యక్షుడిగా ములకలచెరువుకు చెందిన సోమశేఖర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం మండల కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో సంఘ సమావేశం ఏటీఎం మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా తన ఎంపికకు సహకరించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలో విత్తనాలు, ఎరువు మందులు, సబ్సిడీ రుణాలను అందించి రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధప్ప పాల్గొని సోమశేఖర్ కు పూలమాల వేసి అభినందించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతు సంఘ సభ్యులు అభినందించారు. సమావేశంలో ఏ పి ఎం మధుబాబు, నాయకులు చెన్న కృష్ణ, గాండ్ల రెడ్డప్ప, జహీర్ భాష, భాస్కర్ నాయుడు, వెంకటస్వామి, చాను, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్ వర్సిటీ విద్యార్థి వినూత్న ప్రాజెక్ట్ తయారీ

**- ప్రారంభించిన విసి డాక్టర్. సి యువరాజ్**



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ విద్యార్థి కలిచెర్ల వేణుమాధవ్ 'గోసాత్' పేరుతో ఒక వినూత్న రైడ్- షేరింగ్, వాహన అద్దె ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించాడు. ఈ ప్లాట్‌ఫారమ్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ యాప్ రూపొందించడం జరిగిందన్నారు. ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో కూడిన రూట్- మ్యాచింగ్ సదుపాయం, నమ్మకమైన రైడ్- ట్రాకింగ్ ఫీచర్లను ఈ యాప్ అందిస్తుందని తెలిపారు. ఈ యాప్ ద్వారా ముఖ్యంగా డ్రైవర్లు తమ ఖాళీ సమయాన్ని వినియోగించి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి నుంచి ఇలాంటి ప్రాజెక్టులకు రూపొందించడం వారి వినూత్న ఆలోచనలకు అద్దం పడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ యాప్‌ను మరింత విస్తరించి, కొత్త ఫీచర్లను జోడించి పెద్ద స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారని చెప్పారు. మరిన్ని వివరాల కోసం gosaath.com ను సందర్శించవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సనత్ హేగ్డే, డీన్- అకాడెమిక్స్ డాక్టర్ రామ ఎస్ కొమరగిరి, విభాగాధిపతి డాక్టర్ ఆర్ కల్పనా, డాక్టర్ చొక్కనాథన్ పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణ చేసిన వేణుమాధవ్ ను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ యెన్, విజయ భాస్కర్ చౌదరి, ప్రో- ఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్‌రాజు పర్యటన

**- మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నేతలు**



**మదనపల్లె, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యునిగా కూటమి ప్రభుత్వం తరఫున న్యాయవాదుల విశ్వాసం తో ఘనవిజయం సాధించిన శ్రీనివాస్ రాజు గురువారం మదనపల్లెలో పర్యటించారు. రాజకీయంగా, వృత్తిపరంగా ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తన విజయం వెనుక నిలిచిన న్యాయవాదులకు, కూటమి పార్టీ నాయకులకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలియజేయాలనే ఉద్దేశంతో మదనపల్లెకు విచ్చేసిన ఆయనకు బీజేపీ, టీడీపీ , జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. ఇది కేవలం అభినందన కార్యక్రమం మాత్రమే కాకుండా న్యాయవాదుల ఐక్యతకు,కూటమి బలమైన సంఘటిత శక్తికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహా రెడ్డి,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాబ్జీ, విజయభారతి పాఠశాల అధినేత డాక్టర్ సేతు నల్లుస్వామి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ అండ్ రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,బీజేపీ రాజంపేట జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి ఆకుల, రాష్ట్ర బీజేపీ యువమోర్చ నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, మదనపల్లె బీజేపీ పట్టణ అధ్యక్షులు మఠం కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ రాజు విజయం వ్యక్తిగత గెలుపు కాదు, న్యాయవాదుల ఆత్మగౌరవానికి, ధర్మ పరిరక్షణకు సంకేతమన్నారు. ఆయన నాయకత్వంలో బార్ కౌన్సిల్ మరింత పారదర్శకంగా, న్యాయవాదుల హక్కులను కాపాడే దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ సన్మానం కార్యక్రమం మదనపల్లెలో కూటమిశక్తి, సమన్వయం, న్యాయవాదులపై పార్టీకి ఉన్న అంకితభావాన్ని మరోసారి చాటిచెప్పింది.

## అకాడమిక్ ఆడిట్‌లో మహిళా డిగ్రీ కళాశాలకు 'ఎ' గ్రేడ్

**- ధృవీకరణ పత్రం అందుకున్న ప్రిన్సిపాల్ వై.వనజ**



**మదనపల్లె, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకాడమిక్ ఆడిట్‌ను కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్లు డాక్టర్ ఎం.రుక్మిణి, డాక్టర్ ఎస్.గులాబ్ జాన్ కళాశాలలోని రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, వాటి నిర్వహణను పరిశీలించి ధ్రువీకరించారు. ఈ ఆడిట్‌లో కళాశాలకు ఎ గ్రేడ్ లభించినట్లు ప్రిన్సిపాల్ వై.వనజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు ఎ గ్రేడ్ లభించిందని, ఇది కళాశాలకే గర్వకారణమన్నారు. దీని వెనుక కళాశాల అధ్యాపకులు కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన , బోధనేతర సిబ్బంది అందరూ పాల్గొన్నారు. అకాడమిక్ ఆడిట్ ద్వారా విద్యా ప్రమాణాలు, బోధనా పద్ధతులు, విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలను సమీక్షించారు. భవిష్యత్తులో మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు, నాక్ గ్రేడింగ్‌కు సిద్ధమయ్యే దిశగా తీసుకోవలసిన చర్యలపై అకాడమిక్ ఆడిటర్లు ఎగ్జిట్ మీటింగ్‌లో సూచనలు, సలహాలు అందించారు. రికార్డుల పరిశీలన కార్యక్రమం అకాడమిక్ కో-ఆర్డినేటర్ వి.గురుమూర్తి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ టి.టి.పి మోహన్ బాబు ఆధ్వర్యంలో జరిగింది.

## అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**- రాష్ట్ర అధ్యక్షులు ఓబయ్య**




**కమలాపురం, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపు కోవాలని ఏఎస్ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓబయ్య పిలుపు నిచ్చారు. కమలాపురం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను, పౌరు హక్కులను రాజ్యాంగంలో రూపొందించారన్నారు. దేశంలో కుల వివక్షత పై ప్రజల మధ్య అసమానతలపై పరిస్కార మార్గాలకు పునాది వేశారన్నారు. ఆయన అడుగు జాడల్లో మనమంతా నడవాలన్నారు. ఆయన ఆశయాలను, ఆదర్శలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. అందుకు విద్యార్థి లోకం ముందుడాలన్నారు. ఈ నెల 14 న జరిగే అంబేద్కర్ 135వ జయంతి ఉత్సావాలను ఘనంగా జరుపుకోవాలని ఓబయ్య పిలుపు నిచ్చారు.

## మహిళలపై అసభ్య పదజాలం తగదు

**- నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో వైసిపి నిరసన - చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు**



**మదనపల్లె, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళా స్త్రీమూర్తులను పూజించే భారతదేశంలో ఒక పత్రికాధిపతి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం దురదృష్టకరమని వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ పై విషం చిమ్ముతూ ఓ పత్రికాధిపతి చేసిన వ్యాఖ్యలపై గురువారం మదనపల్లె టూటౌన్ పోలీసులకు నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో వైఎస్సార్సిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు మదనపల్లె టూటౌన్ పోలీసులకు పత్రికాధిపతి పై చర్యలు కోరుతూ ఫిర్యాదు చేశామన్నారు. భారతదేశం పవిత్రమైన నేల ఆడవారిని పూజించే సంస్కారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో మహిళలను కించపరిచే విధంగా రాతలు రాయడం, వ్యాఖ్యలు చేయడం, దానికి చంద్రబాబు నాయుడు మద్దతు నివ్వడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా పత్రికాధిపతి తన వైఖరిని మార్చుకుని క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ మనూజా రెడ్డి,ఎస్ఈసి మెంబర్ షమీమ్ అస్లాం, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు డి.హర్షవర్ధన్ రెడ్డి,వివిధ మండలాల పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ కృషి

**- ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం**



**పీలేరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్.ఎస్.యూ.ఐ) విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ తెలిపారు. గురువారం ఎన్.ఎస్.యూ.ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పీలేరు పట్టణంలో జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎన్.ఎస్.యూ.ఐ సమర్థవంతం గా పనిచేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు సాగుతుందని అన్నారు. విద్యార్థులకు రక్షణ కవచంలా వారి హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలకు ఎన్.ఎస్.యూ.ఐ స్పందించి పరిష్కారం చూపిస్తుందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా నిరంతరం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విద్యార్థి విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐ, మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1971 ఏప్రిల్ 9న కేరళ స్టూడెంట్స్ యూనియన్ , పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఛాత్ర పరిషత్‌లను విలీనం చేసి స్థాపించారని వివరించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి, హరీష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తున్న పాఠశాలలపై చర్య తీసుకోవాలి

**- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై**
**- ఎన్.ఎస్.యూ.ఐ, వై.ఎస్.ఆర్.ఎస్.యూ ఆగ్రహం**



**పీలేరు,ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్చి 16 నుండి పాఠశాలలకు ఒంటిపూట బదులు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, పీలేరు మండలంలో కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఉల్లంఘిస్తూ రోజంతా తరగతులు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ, వై.ఎస్.ఆర్.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. నరేష్ కుమార్, ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సి. సాయి సంపత్ పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేసి, విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న తరగతులను తక్షణమే నిలిపివేయించి, విద్యార్థులను ఇండ్లకు పంపించారు. ఈ సందర్భంగా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "విద్యా శాఖ అధికారులు ఏమి చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. పీలేరు మండలంలో నిబంధనలు బహిరంగంగా ఉల్లంఘిస్తున్నప్పటికీ, మండల విద్యా శాఖ అధికారులు కనీస పర్యవేక్షణ కూడా చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విద్యా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ పాఠశాలలపై సీజ్, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పీలేరు మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించని పక్షంలో ఎన్.ఎస్.యూ.ఐ ,వై.ఎస్.ఆర్.ఎస్.యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి విద్యా శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కాపాడడంలో విద్యార్థి సంఘాలు ఎప్పటికీ ముందుంటాయి అని స్పష్టం చేశారు.

## ఆంజనేయస్వామిని దర్శించుకున్న నిస్సార్ అహమ్మద్



**రామసముద్రం, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మినికి గ్రామంలోని ఆంజనేయ దేవాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గం వైయస్సార్ సిపి సమన్వయకర్త ఎస్.నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని, ధర్మకర్తలు, గ్రామస్థులను అభినందించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చు కోవాలని సూచిస్తూ, భక్తి పరంపరను కొనసాగించమని సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్. రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్. రఘునాథ రెడ్డి, ఆలయ ధర్మకర్త సుబ్బరెడ్డి, రామసముద్రం మండల కన్వీనర్ కేశవరెడ్డి, ఎంపిపి వెంకటరమణ రెడ్డి, కృష్ణ రెడ్డి, వాసుదేవ రెడ్డి, నాగరాజ్, సుజ్ఞానమూర్తి, రవికుమార్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాబు హరి, తిమ్మయ్య, భాస్కర్ గౌడ్, రెడ్డి వీరే గౌడ్, గవెన్న, జబి, శంకర్ నాయక్, తిమ్మా రెడ్డి, మాలెపాడు చలపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా అంతర్జాతీయ బంజారా డే వేడుకలు



**పీలేరు, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు ప్రాంతంలో అంతర్జాతీయ బంజారా డే సందర్భంగా జరిగిన వేడుకలు బంజారా సమాజ ఐక్యత, సంప్రదాయం, సంస్కృతికి ప్రతీకగా నిలిచాయి. ఏప్రిల్ 8వ తేదీ బుధవారం రాత్రి స్థానిక కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు. సంప్రదాయ దుస్తులు, నృత్యాలు, పాటలతో వేదిక కళకళలాడింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ బంజారా సమాజం యొక్క గొప్ప చరిత్ర, సంప్రదాయాలను గుర్తు చేశారు. భాష, ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. కీలక రంగాల్లో బంజారా సమాజం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, నాగమణి నాయక్, రవి నాయక్, సాక్షి రవీంద్ర నాయక్, గోపీనాయక్, రామ్మూర్తి నాయక్ తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నాటకమే వెంకటయ్య ఊపిరి

**- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి**



**కడప , ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నేను పోయినా నా నాటకం బ్రతికి ఉండాలని కలలుగన్న ఆల్లూరి వెంకటయ్య జీవితం ధన్యమని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. రంగస్థల నాటకమే శ్వాసగా , ధ్యాసగా భావించి నేను నాటకాన్ని నడిపిస్తాను, నాటకమే నా ఆశయాన్ని నడి పిస్తుందని వెంకటయ్య అనేవారని ఆయన తెలిపారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో నాటక రథసారథి ఆల్లూరి వెంకటయ్య 89వ జయం తిని ఘనంగా నిర్వహించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాల్లో కడప జిల్లాకు 28 నంది బహుమతులు సాధించిన ఘనత ఒక్క వెంకటయ్యకే దక్కుతుందని, ఆయన సారథ్యం లో వాసవి కన్యక, సతీ అహల్య ,శ్రీరామపాదుకలు, శ్రీరామ పట్టాభిషేకం, వరూధిని ప్రవరాఖ్యులు మొదలైన ఎన్నో నాటకాలు నంది అవార్డులు సాధిం చాయని చెప్పారు. ఈ కార్య క్రమంలో రంగస్థల కళాకారులు మందల మురళి, ప్రకాశం, బాల ఓబయ్య, సత్యనారాయణ తదిత రులు పాల్గొన్నారు.

# నందిగామలో సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన...



**నందిగామ ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ పట్టణంలో సైబర్ నేరాల నివారణపై పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్ఐ మహతి, మోహన్ రావు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పాల్గొని ప్రజలకు మార్గదర్శకాలు ఇచ్చారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నారని, అందువల్ల సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదే సమయంలో ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను కూడా వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగాన్ని నివారించాలని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి మార్గంలో సాగాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, వాహనదారులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసుల సూచనలను స్వాగతించారు.

# ప్రతి రైతుకు కిసాన్ క్రెడిట్ కార్డును మంజూరు చేయాలి
## : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా.



**నరసరావుపేట, ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వ్యవసాయ అనుబంధ శాఖలు, బ్యాంకర్లతో కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ పైన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో రైతులకు ఆర్థికంగా మరింత బలాన్నిచ్చే లక్ష్యంతో లికిస్సాన్ క్రెడిట్ కార్డ్స్ (ఖజజ)లి పథకాన్ని విస్తృతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులు తక్కువ వడ్డీతో సులభంగా రుణాలను పొందగలరని పేర్కొన్నారు. కిస్సాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మరియు ఇతర వ్యవసాయ అవసరాల కోసం తక్షణ ఆర్థిక సహాయం పొందవచ్చు. ఇది రైతులపై ఉన్న అప్పుల భారాన్ని తగ్గించడంలో మరియు వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. లబ్ధిదారులకు బ్యాంకులు విరివిగా ఋణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఇప్పటికే కార్డు పొందిన రైతులు సకాలంలో రుణాలను తిరిగి చెల్లించి ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలను పొందాలని కోరారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు..
## కొనసాగుతోన్న ఎంపిక ప్రక్రియ




**నందిగామ ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామలో కొత్తగా మంజూరైన కేంద్రీయ విద్యాలయంలో లాటరీ పద్ధతిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా నియమించిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 1 నుంచి ఐదో తరగతిలోకి ప్రవేశాలకు లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. ఇంఛార్జ్ ఆర్డీవో పోసి బాబు, తహసీల్దార్ సురేష్ బాబు , ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ పంకజ్ సమక్షంలో ప్రక్రియ కొనసాగుతోంది. ఇతరులు ఎవరూ కేంద్రంలోకి రాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రవేశాల వివరాల కోసం విద్యాలయం వద్దే వేచి ఉన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఎంపికైన విద్యార్థుల వివరాలు వెల్లడించనున్నారు.

# 40 మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు



**నందిగామ ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ నియోజకవర్గం నందిగామ రూరల్ మండలం కంచల గ్రామంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజనా 2.ా పథకం క్రింద 40 మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన మేరకు పేద ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని దేశవ్యాప్తంగా కొన్ని కోట్ల మందికి ఈ కనెక్షన్లు ఇస్తున్నారు. జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి తొర్లికొండ సీతారామయ్య, భాజపా మండల అధ్యక్షుడు గంటా వెంకట్రావు, రామిరెడ్డి సుబ్బారావు, రామిరెడ్డి శ్రీనివాసరావు, చలమల సౌందర్య, మందడపు నరసింహారావు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్‌లు అందించారు.

# చిన్నముత్తేవి గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



**పామర్రు ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణా జిల్లా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామపంచాయతీ కార్యదర్శి యెండూరి సాయి. ఫణీంద్ర కుమార్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎండివో డి.సుహాసిని గురువారం విలేకరులకు తెలిపారు. ఆమె అందించిన వివరాల మేర మార్చి 29వ తేదీన డిపివో జె.అరుణ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతంపై నిర్లక్ష్యం వహించగా ఈ చర్యలు చేపట్టినట్లు ఎండివో తెలిపారు.

# కంచికచర్లలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు...



**నందిగామ ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్లలోని జుజ్జూరు రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వసంత కాలనీకి చెందిన కొండా నాగేశ్వరావు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరావుకు తీవ్ర గాయాలు కాగా, వాహనం నడిపిన వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికులు రోడ్డుపై వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

# ప్రజా అర్జీలకు సమయానుకూల పరిష్కారం తప్పనిసరి: కలెక్టర్



**విజయవాడ , ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ ప్రభుత్వంపై వారి నమ్మకానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొత్తం 97 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను అధికారులు ప్రాధాన్యంగా తీసుకుని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని ఆయన కోరారు.

# విద్యార్థులకు గుడ్ న్యూస్
## : ఉచితంగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్



**విజయవాడ , ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల కోసం ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్‌ను సులభతరం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డులు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉచితంగా బయోమెట్రిక్ అప్డేట్ క్యాంపులు నిర్వహించనుంది. తొలి విడతగా ఈ నెల 15 నుంచి 18 వరకు, రెండో విడతగా 21 నుంచి 24 వరకు ఈ క్యాంపులు కొనసాగనున్నాయి.బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోకపోతే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు, స్కాలర్‌షిప్‌లు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12.09 లక్షల మంది తమ ఆధార్ వివరాలను నవీకరించుకోవాల్సి ఉందని వెల్లడించారు.అందువల్ల అర్హులైన విద్యార్థులు సమీప క్యాంపులను ఉపయోగించుకుని తమ బయోమెట్రిక్ వివరాలను అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

# రైతులకు శుభవార్త
## : ఏపీలో రబీ ధాన్యం సేకరణ షురూ!



**విజయవాడ , ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్‌లో రబీ ధాన్యం సేకరణను కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించిన ప్రభుత్వం, అదే స్ఫూర్తితో రబీలోనూ రైతులకు అండగా నిలుస్తోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ ప్రక్రియపై కీలక ప్రకటన చేస్తూ, రైతుల ప్రయోజనాలే పరమావధిగా అక్రమాలకు తావులేకుండా కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు.నగదు జమ: ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేలా పక్కాగా ఏర్పాట్లు చేశారు.రికార్డు స్థాయి సేకరణ: ఖరీఫ్‌లో విభజన తర్వాత అత్యధికంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, సుమారు రూ.11,300 కోట్లు చెల్లించారు.పారదర్శకత: గత ప్రభుత్వంలో నెలకొన్న జాప్యం, బకాయిల సమస్యలు లేకుండా అత్యంత వేగంగా నిధులు విడుదల చేస్తున్నారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా, రబీలోనూ భారీ స్థాయిలో ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి ఆదాయంపై గండి?.. భక్తుల ఆందోళన...




**నందిగామ ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి):** పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ ఆదాయంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై అమ్మవారి ఆదాయానికి గండి కొడుతున్నారని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి సంబంధించిన వేలంపాటలు పారదర్శకంగా నిర్వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. భక్తుల కథనం ప్రకారం, ఆలయానికి వచ్చే ఆదాయ వనరులను తక్కువ ధరలకే కొందరు వ్యక్తులు దక్కించుకుంటున్నారని, దీనివల్ల ఆలయానికి రావాల్సిన ఆదాయం భారీగా తగ్గిపోయిందని చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం గణనీయంగా పడిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, వ్యాపారులు కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ ఆదాయం సరైన విధంగా వినియోగం కావాలంటే పారదర్శక వ్యవస్థ అవసరమని వారు సూచిస్తున్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిజానిజాలు వెలికితీయాలని, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని కోరుతున్నారు.

# సోషల్ మీడియా పరిచయం.. అత్యాచారయత్నం ; నిందితుడి అరెస్ట్




**మాచర్ల, ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయం కాస్తా ఓ మహిళపై దాడి, అత్యాచారయత్నానికి దారితీసిన ఘటన మాచర్ల పట్టణంలో ఈనెల రెండో తేదీన చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు

ఘటన వివరాలు:

మాచర్ల పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మహిళా ప్రభుత్వ ఉద్యోగినికి, రాజపాలెం గ్రామానికి చెందిన నాగుల శ్రీనివాస్ (అలియాస్ సంజు, శ్రీను) అనే వ్యక్తితో సోషల్ మీడియా యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వీరి పరిచయం సన్నిహితంగా మారింది.

ఈ క్రమంలో, ఏప్రిల్ 2వ తేదీ మధ్యాహ్నం నిందితుడు శ్రీనివాస్ బాధితురాలి ఆహ్వానం మేరకు ఆమె ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో, నిందితుడు ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో ఆగ్రహానికి గురైన నిందితుడు, ఆమెను తీవ్రంగా కొట్టి, కాళ్లు చేతులు కట్టేసి భయభ్రాంతులకు గురిచేసి అక్కడి నుండి పరారయ్యాడు.

పోలీసుల దర్యాప్తు – అరెస్ట్:

బాధితురాలి ఫిర్యాదు మేరకు మాచర్ల టౌన్ పోలీసులు కేసు (జతీ.చీశీ.34/2026 ఖ/o 64(1), 127(2), 115(2) దీచీూ) నమోదు చేశారు. జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.వి. సంతోష్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ మరియు బాధితురాలి ఫోన్ డేటా ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు, ఏప్రిల్ 8వ తేదీ ఉదయం మాచర్ల రైల్వే స్టేషన్ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

# మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపుడి హై స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం పథకం అమలు విధానాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులతో కలిసి స్వయంగా క్యూలైన్‌లో నిలబడిన ఎమ్మెల్యే.. భోజనం పెట్టించుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు అందరూ పాఠశాలలోనే భోజనం చేసేలా నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు, విద్యా కమిటీ ఛైర్మన్ బాజీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం చేయని పలువురు విద్యార్థులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. పాఠశాలలో ఉన్న 540 మంది విద్యార్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ప్లేట్లను అందిస్తామన్నారు.

# గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి




**కలసపాడు ఏప్రిల్ 09( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటే తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్య అధికారులు శైలజ, సాయితేజ తెలిపారు. గురువారం కలసపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ వైద్య నిపుణురాలు అఖిల.. 26 మంది గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేశారు. ఇతర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకుంటే మొదటి కాన్పునకు రూ. 6 వేలు, రెండో కాన్పునకు పాప పుడితే రూ. 6 వేలు నగదు ప్రోత్సాహకం ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి వెంకట సుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్ఎం రాములమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ స్వాతి, స్టాఫ్ నర్స్ మాధవి పాల్గొన్నారు.


## డెకాయిట్ సరిచేయాల్సిన లెక్కలు



రేపు విడుదల కాబోతున్న డెకాయిట్ మీద ట్రేడ్ వర్గాలే కాదు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బుక్ మై షోలో ఆల్రెడీ ట్రెండింగ్ లో ఉండగా క్రమంగా నెంబర్లు పెరుగుతూ పోవడం శుభసూచకంగా చెప్పుకోవాలి. అంచనాలు మరీ అరివీరభయంకరంగా ఉన్నాయని చెప్పలేం కానీ అడివి శేష్ బ్రాండ్ తో పాటు ట్రైలర్ లో చూపించిన లవ్, యాక్షన్ కంటెంట్ దీన్ని థియేటర్ ఎక్స్ పీరియన్స్ చేయాలనే నమ్మకాన్ని ఆడియన్స్ లో కలిగించింది. అదే ప్లస్ గా మారింది. డెకాయిట్ సరిచేయాల్సిన లెక్కలు చాలానే ఉన్నాయి. మొదటిది అడివి శేష్ హిట్ 2 తర్వాత మూడేళ్ల పాటు దీన్ని నిర్మాణంలో ఉంచిన గ్యాప్ కి న్యాయం జరిగేలా కంటెంట్ ఉందని జనాలు భావించాలి. రెండోది నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈసారి తండ్రి, మావయ్య ప్రమేయం లేకుండా స్వంతంగా అన్నపూర్ణ, ఎస్ఎస్ క్రియేషన్స్ బ్యానర్ల సంయుక్త నిర్మాణంలో ప్రొడక్షన్ మొత్తం తనే చూసుకుంది. ప్రొడ్యూసర్ గా ఈ అడుగు ఎలా ఉంటుందోనని ఇతర నిర్మాతలు వేచి చూస్తున్నారు. మూడోది ఏ బ్రాండ్ ఇమేజ్ లేని దర్శకుడు షానియేల్ డియో పనితనం. డైరెక్షన్ అనుభవం ఎక్కువగా లేకపోయినా ఇంత పెద్ద యాక్షన్ గ్రాండియర్ ని అది కూడా సీనియర్ మోస్ట్ ఆర్టిస్టులతో తెరకెక్కించడం పెద్ద సవాల్. శేష్, నాగార్జున, సుప్రియ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. నాలుగోది మృణాల్ ఠాకూర్ టేస్ట్. సీతారామం, హాయ్ నాన్న లాంటి క్లాసిక్స్ చేశాక ఫ్యామిలీ స్టార్ రూపంలో తనకో డిజాస్టర్ పడింది. ఇప్పుడు మళ్ళీ ట్రాక్ లోకి రావాలంటే డెకాయిట్ చేయి అందించాలి. ఇలా ఇన్నేసి క్యాలికులేషన్లు డెకాయిట్ మీద ఉన్నాయి. గత వారం రిలీజైన బైకర్, రాకాస చెప్పుకోదగ్గ టాక్ తో మొదటి వీకెండ్ బండి లాగినప్పటికీ తర్వాత స్లో అయ్యాయి. రెండో వారాంతంలో ఏ మేరకు పికప్ అవుతాయనేది డెకాయిట్ రిజల్ట్ మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ శేష్ మూవీ కనక హిట్ అనిపించుకుంటే ఆటోమేటిక్ గా ఆడియన్స్ ఫస్ట్ ఛాయస్ ఇదే అవుతుంది. టీమ్ కాన్ఫిడెన్స్ చూస్తుంటే నమ్మకాలు నిజమయ్యేలానే ఉన్నాయి. రేపు ఉదయం ఎనిమిది నుంచి షోలు స్టార్ట్ కాబోతున్నాయి.


# దురంధర్ భామకు శ్రీలీల పంచ్?





చాలా తక్కువ సమయంలోనే పెద్ద హీరోయిన్‌గా ఎదిగినప్పటికీ.. చాలా అణకువతో వ్యవహరించే అమ్మాయి శ్రీలీల. ఇప్పటిదాకా ఆమె ఎలాంటి వివాదంలోనూ చిక్కుకోలేదు. ఎప్పుడూ అదుపు తప్పి మాట్లాడింది లేదు. ఎవరికీ పంచ్ వేసింది లేదు. కానీ తొలిసారి ఆమె చేసిన కామెంట్ కొంచెం వివాదాస్పదం అయింది. సినిమాల్లో నటించే అమ్మాయిలకు పీరియడ్స్ అన్నవి ఒక సాకు కాదు అంటూ ఆమె తాజాగా కామెంట్ చేసింది. శ్రీలీల ఇలా మాట్లాడ్డం వెనుక ఒక నేపథ్యం ఉంది. తెలుగులో 'ఓం భీం బుష్' సహా కొన్ని చిత్రాల్లో నటించిన ముంబయి భామ ఆయేషా ఖాన్.. బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ 'దురంధర్'లో ఒక ఐటెం సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పాట చేసేటప్పుడు తాను పీరియడ్స్‌లో ఉన్నానని.. అయినా ఆ ఇబ్బందితోనే కష్టమైన డ్యాన్స్ మూమెంట్స్ చేశానని ఆయేషా చెప్పడం చర్చనీయాంశం అయింది. చాలామంది ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. ఆమె కమిట్మెంట్‌ను కొనియాడారు. కానీ కొందరు మాత్రం ఇదేమంత విషయం అన్నట్లుగా కామెంట్లు చేశారు. పీరియడ్స్‌లో ఉంటూ అంతకుమించి కష్టం పడే మహిళలు మన చుట్టూ లేరా, దాన్నో పెద్ద విషయంలా చెప్పడమేంటి అన్నట్లుగా మాట్లాడారు. ఐతే ఎవరో ఊరూ పేరు లేని వాళ్లు ఇలాంటి కామెంట్లు చేస్తారు కానీ.. ఒక పేరున్న హీరోయిన్, పైగా ఎంబీబీఎస్ చదువుకున్న శ్రీలీల ఇదే తరహాలో కామెంట్ చేయడమే వివాదానికి దారి తీసింది. ఒక మహిళగా తాను ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని.. తాను పీరియడ్స్‌లో ఉండగా ఎన్నో పాటలకు డ్యాన్స్ చేశానని.. దాన్నొక సాకుగా చూపించే అవకాశం లేదని ఆమె స్పష్టం చేసింది. శారీరకంగా, మానసికంగా అన్ని సవాళ్లకూ సిద్ధంగా ఉండాలని శ్రీలీల అభిప్రాయపడింది. ఆయేషాకు కౌంటర్‌గా ఉద్దేశపూర్వకరంగానే శ్రీలీల ఈ వ్యాఖ్యలు చేసిందో లేదో కానీ.. అందరూ దానికే కనెక్ట్ చేసుకుంటున్నారు. ఒక మహిళ, పైగా డాక్టర్ అయి ఉండి ఇలాంటి కామెంట్లు చేయడమేంటి అంటూ ఆమెను కొందరు తప్పుబడుతున్నారు.

# పెద్ది ఐటమ్ సాంగ్.. ఏదో అనుకుంటే



ప్రస్తుతం టాలీవుడ్లో తర్వాత రాబోయే పెద్ద సినిమా.. పెద్దినే. వేసవికి షెడ్యూల్ అయిన ఏకైక పెద్ద చిత్రమిది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 30కి వాయిదా పడ్డ ఆ మూవీ.. ఈ డేట్‌కు కూడా కట్టుబడి ఉంటుందా అన్నది సందేహంగానే ఉంది. వాయిదా లాంఛనమే అంటున్నారు. మరి కొన్ని రోజుల్లో కొత్త డేట్ ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ దిశగా అభిమానులను ముందే ప్రిపేర్ చేసేసిన టీం.. మిగతా పనుల మీద దృష్టిసారించింది. ఈ చిత్రంలో అదిరిపోయే ఐటెం సాంగ్ ఉంటుందని.. అందులో డ్యాన్సులు అదిరిపోతాయని కొన్ని రోజుల ముందే సమాచారం బయటికి వచ్చింది. ఈ పాటలో చరణ్‌తో పాటు డ్యాన్స్ చేసే హీరోయిన్‌కు సంబంధించి రకరకాల పేర్లు వినిపించాయి. చివరగా మృణాల్ ఠాకూర్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటిదాకా తెలుగులో గ్లామర్ పాత్ర చేయని మృణాల్.. తొలిసారి ఐటెం సాంగ్ చేస్తే ఎలా ఉంటుందా అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఐతే మృణాల్ 'పెద్ది' పాట చేయబోతోందని ఫిక్సయిపోయి భారీ అంచనాలతో ఉన్న మెగా అభిమానులకు దర్శకుడు బుచ్చిబాబు సానా పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో మృణాల్ నర్తించదట. 'కపుల్ ఫ్రెండ్లీ'తో మంచి గుర్తింపు సంపాదించిన తెలుగమ్మాయి మానస వారణాసిని ఈ పాటలో చూడబోతున్నామట. ప్రేక్షకుల అంచనాలకు భిన్నంగా మానసను ఈ పాట కోసం ఓకే చేశారట. మానస కెరీర్లో తొలి అడుగులు వేస్తున్న అమ్మాయి. ఆమె ఇప్పటిదాకా తెలుగులో చేసిన రెండు సినిమాల్లో తన గ్లామర్ హైలైట్ అవ్వలేదు. 'కపుల్ ఫ్రెండ్లీ'లో అయితే ఒక మామూలు మధ్య తరగతి అమ్మాయిలా కనిపించింది. పెర్ఫామెన్స్‌తో మెప్పించింది. ఆమె ఐటెం సాంగ్‌లో కనిపించడం అన్నది కచ్చితంగా షాకే. దీన్ని మెగా ఫ్యాన్స్ ఎలా తీసుకుంటారో చెప్పలేం. ఇప్పటికైతే ఇది కేవలం సమాచారం మాత్రమే.. ఎంతవరకు లాక్ అయ్యిందో అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. చాలా ఏళ్లుగా ఐటెం సాంగ్స్ కూడా పెద్ద హీరోయిన్లే చేస్తున్నారు. చరణ్ సినిమా అంటే స్పెషల్ సాంగ్ చేసే హీరోయిన్‌కు కూడా ఒక రేంజ్ ఉండాలని ఫ్యాన్స్ ఆశిస్తారు. కానీ బుచ్చిబాబు వారి ఆకాంక్షలకు భిన్నంగా వెళ్తున్నాడు. మరి మానస ఎలా మెప్పిస్తుందో.. తెరపై ఈ పాట ఎలా పండుతుందో చూడాలి.




## డోస్ సరిపోలేదు రాకా





'పుష్ప-2' లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ సినిమా మీద ఏ స్థాయిలో అంచనాలు ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. త్రివిక్రమ్ సినిమాను హోల్డ్‌లో పెట్టి మరీ అట్లీతో బన్నీ జట్టు కట్టడంతో అది చాలా ప్రత్యేకమైన సినిమానే అయి ఉంటుందని అభిమానులు భావించారు. ఇప్పటిదాకా అట్లీకి ఫెయిల్యూర్ అన్నదే లేదు. 'రాజా రాణి' నుంచి 'జవాన్' వరకూ అన్నీ బ్లాక్‌బస్టర్లే. కాకపోతే అట్లీ సినిమాలు రొటీన్‌గా ఉంటాయని.. సగటు కమర్షియల్ మీటర్‌ను దాటి ముందుకు వెళ్లడనే విమర్శలు ఉన్నాయి. కానీ ఈసారి అట్లీ సగటు మాస్ మసాలా సినిమాకు పరిమితం కాకుండా బన్నీ రేంజికి తగ్గట్లు ఒక భారీ ఈవెంట్ ఫిల్మ్ చేయడానికే రెడీ అయ్యాడు. అతను ఏదో స్పెషల్‌గా ట్రై చేస్తున్నాడని.. సినిమాను అనౌన్స్ చేసినపుడే అర్థమైంది. పెద్ద పెద్ద హాలీవుడ్ స్టూడియోలను ఈ సినిమాలో ఇన్వాల్వ్ చేశారు. ఏకంగా రూ.800 కోట్ల బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. ఐతే ఈ సినిమా గురించి ఇప్పటిదాకా జనాలు ఊహించుకున్న రేంజిలో అయితే నిన్న రిలీజ్ చేసిన టైటిల్ లుక్ లేదన్నది వాస్తవం. బన్నీ సినిమా నుంచి తొలి విశేషాన్ని పంచుకున్నపుడు సోషల్ మీడియా షేక్ అయిపోతుందనే సంకేతాలను టీం వర్గాలు ఇచ్చాయి. కానీ నిన్న అలా జరగలేదు. ముందు సినిమా నుంచి వీడియో గ్లింప్స్ కాకుండా టైటిల్ లుక్ మాత్రమే రిలీజ్ చేయడంతోనే సగం ఆసక్తి తగ్గిపోయింది. ఇక టైటిల్, బన్నీ లుక్‌కు ఎక్కడెక్కడో పోలికలు కనిపించడంతో ఒక రకమైన నిట్టూర్పు కనిపించింది అభిమానుల్లో. తాము అంచనా వేసినట్లు నిన్న సోషల్ మీడియా షేక్ కాకపోవడంతో ఫ్యాన్స్ డిజప్పాయింట్ అయ్యారు. సోషల్ మీడియా ట్రెండ్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండే బన్నీ టీంకు ఈ ఫీడ్ బ్యాక్ అందకుండా ఉండదు. ఈ ప్రాజెక్టు స్కేల్‌కు తగ్గట్లు తర్వాత ఏదో భారీగా చేస్తే తప్ప సినిమాకు కోరుకున్న హైప్ రాదు. ఇంతకుముందు ఊరించి ఊరించి ప్రస్తుతానికి పక్కన పెట్టి గ్లింప్స్ విషయంలో అట్లీ అండ్ టీం చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిందే. దాన్ని వావ్ అనిపించే స్థాయిలో తీర్చిదిద్ది మంచి సందర్భం చూసి రిలీజ్ చేయాలి.



# బిజినెస్ న్యూస్



## Q4లో అదరగొట్టిన TCS.. ఒక్కో షేరుకు రూ.31 డివిడెండ్




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గానూ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభంలో 12.22 శాతం వృద్ధి కనబరిచింది.గతేడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.12,224 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించగా.. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.10, 657 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.49,210 కోట్ల నికర లాభం పొందింది. సమీక్షిస్తున్న త్రైమాసికానికి గానూ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 9.64 శాతం వృద్ధితో రూ.64,479 కోట్ల నుంచి రూ.70,698 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 4.58 శాతం వృద్ధితో రూ.2.67 లక్షల కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ కంపెనీ ఒక్కో షేరుకు రూ.31 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో 12 బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు కంపెనీ సీఈఓ కృతివాసన్ వెల్లడించారు. కృత్రిమ మేధ సంబంధిత సేవల ద్వారా వచ్చే వార్షిక ఆదాయం 2.3 బిలియన్ డాలర్లు దాటినట్లు వెల్లడించారు. నాలుగో త్రైమాసికంలో నికరంగా 2,000 మందికి పైగా ఉద్యోగులు కంపెనీలో చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,84,519కి చేరింది. అయితే, వలసల రేటు (అట్రిషన్ రేటు) స్వల్పంగా పెరిగి 13.7 శాతానికి చేరింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు విలువ 1.09 శాతం లాభంతో రూ.2587.75 వద్ద ముగిసింది.

## 5 రోజుల వరుస లాభాలకు బ్రేక్.. సెన్సెక్స్ 931 పాయింట్లు డౌన్




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఐదు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లు పైకి కనిపించినా.. నివురుగప్పిన నిప్పులా ఎప్పుడు రాజుకుంటాయోనన్న భయాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ దాడులకు ప్రతిగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో మళ్లీ అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం స్టాక్ మార్కెట్‌లపై ప్రతికూల ప్రభావం పడింది. మదుపర్ల లాభాల స్వీకరణకు దిగడం, ఎఫ్ఐఐల విక్రయాలూ తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,319.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,562.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కనిపించింది. ఇంట్రాడేలో 76,347.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 931.25 పాయింట్ల నష్టంతో 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్అండ్‌టీ, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో మళ్లీ ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ప్రకటనతో 95 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర.. మళ్లీ 98.42 డాలర్లకు చేరింది. బంగారం ఔన్స్ 4728 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## స్మార్ట్‌టీవీల్లో ఇకపై 90 సెకన్ల యూట్యూబ్ యాడ్స్




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్‌టీవీ (శీబ్‌బఎవ ుజం)ల్లో సుదీర్ఘ అన్‌స్కిప్పబుల్ యాడ్స్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా 90 సెకన్ల వరకు స్కిప్ చేయలేని యాడ్స్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు తెలిసింది. ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఈతరహా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, దీనిపై యూట్యూబ్ నుంచి అధికార ప్రకటన రావాల్సిఉంది. ఇప్పటివరకు స్మార్ట్‌టీవీల్లో 30 సెకన్ల అన్‌స్కిప్పబుల్ యాడ్స్ మాత్రమే వస్తున్నాయి. దాని స్థానంలో 90 సెకన్ల పాటు ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 20 నిమిషాల నుంచి 40 నిమిషాల నిడివి కలిగిన వీడియోలకు ఈ తరహా యాడ్స్‌ను పుష్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు యూజర్లకు 90 సెకన్ల యాడ్స్ కనిపిస్తున్నాయి. సంబంధిత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు సంప్రదాయ ప్రకటనదారులను ఆకర్షించడం.. మరోవైపు యాడ్స్ వద్దనుకునే యూజర్లను ప్రీమియం వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ మార్పు చేస్తున్నట్లు టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీన్ని కేవలం స్మార్ట్‌టీవీలకే పరిమితం చేస్తారా? లేదంటే మొబైల్‌కూ వర్తింపజేస్తారా? చూడాలి మరి.

## పీపీఎఫ్ ఖాతా ఎన్నిసార్లు పొడిగించుకోవచ్చు? వడ్డీ ఎంతొస్తుంది?



దీర్ఘకాలంలో మంచి నిధిని నిర్మించడానికి ఉన్న మార్గాల్లో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఒకటి (ప్రాఫ్). ఇది కేంద్ర ప్రభుత్వ మద్దతు, హామీ ఉన్న పథకం కావడంతో మీ సొమ్ముకు భరోసా ఉంటుంది. పైగా ఈ పథకంలో రాబడులపై పూర్తిగా ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలూ (పాత పన్ను విధానంలో) పొందొచ్చు. సాధారణంగా ఈ పథకం కాలవ్యవధి 15 ఏళ్లు. దీన్ని మరికొంత కాలం పొడిగించుకోవచ్చు. ఇలా ఎంతకాలం పొడిగించుకోవచ్చు? తద్వారా ఎంత మొత్తం సమకూరుతుంది?

ఎక్కడ తెరవొచ్చు?

పీపీఎఫ్ ఖాతాను పోస్టాఫీసులో గానీ, ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో గానీ తెరవొచ్చు. పూర్తి కాలవ్యవధి 15 సంవత్సరాలు. ఏడాదికి కనీస డిపాజిట్ కింద రూ.500, గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు డిపాజిట్ చేయొచ్చు. వడ్డీ ఏడాదికి ప్రస్తుతం 7.10% (3 నెలలకు ఒకసారి ప్రభుత్వం వడ్డీ నిర్ణయిస్తుంది.) లభిస్తోంది. ఈ డిపాజిట్‌కు, వడ్డీకి ప్రభుత్వం హామీ ఉంటుంది కాబట్టి 100% రిస్క్ లేదు. ఆర్థిక సంవత్సరం (మార్చి 31వ తేదీ) పూర్తికాగానే వడ్డీ జమ అవుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో పీపీఎఫ్ ఖాతాలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఖాతాను ఎన్నేళ్లు పొడిగించుకోవచ్చు?

పీపీఎఫ్ ఖాతా 15 ఏళ్లకు మెచ్యూర్ అవుతుంది. గడువు తర్వాత మూసేయొచ్చు. కావాలంటే పొడిగించుకోవచ్చు. ఐదేళ్ల బ్లాక్ చొప్పున ఎన్నిసార్లయినా పొడిగించుకునే వీలుంది. ఖాతాను పొడిగించాలంటే మెచ్యూరిటీకి ఏడాదిలోపు పొడిగింపు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. పొడిగించే కాలానికి డిపాజిట్ చేయొచ్చు. చేయకుండా కూడా కొనసాగించొచ్చు. మధ్యలో ఏదైనా అవసరం ఏర్పడితే అవసరాల నిమిత్తం ఒక బ్లాక్‌లో గరిష్ఠంగా 60% బ్యాలెన్స్‌ని విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఎంత వడ్డీ వస్తుంది? ప్రస్తుతం పీపీఎఫ్ ఖాతాలో జమయ్యే మొత్తంపై 7.1 శాతం వడ్డీ లభిస్తోంది. 15 ఏళ్ల పాటు ఈ ఖాతాలో గరిష్ఠ డిపాజిట్ మొత్తం అయిన రూ.1.50 లక్షలు చొప్పున జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత రూ.40.68 లక్షలు వస్తుంది. ఇందులో మీ అసలు 22.50 లక్షలు కాగా.. వడ్డీ రూ.18.18 లక్షలు లభిస్తుంది.

ఆప్షన్-1: ఒకవేళ మీరు మీ పీపీఎఫ్ ఖాతాను 5 సంవత్సరాలు పొడిగించి సంవత్సరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడిని కొనసాగిస్తే 20 ఏళ్ల తర్వాత సుమారు రూ.67 లక్షలు వరకు పొందొచ్చు. మరో 5 ఏళ్లు అంటే, 25 ఏళ్ల వరకు ఇదే పెట్టుబడితో కొనసాగిస్తే మెచ్యూరిటీ సుమారు రూ.1.03 కోట్లు వస్తుంది.

ఆప్షన్-2: ఒకవేళ మీరు మెచ్యూరిటీ తర్వాత ఎలాంటి పెట్టుబడులూ పెట్టకుండా మరో 5 ఏళ్ల పాటు పీపీఎఫ్ ఖాతాను కొనసాగిస్తే.. అసలూ వడ్డీ కలిపి 20 ఏళ్లకు రూ.57.32 లక్షలు వస్తుంది. పొడిగించిన ఐదేళ్ల కాలానికి దాదాపు రూ.16 లక్షలు వడ్డీ లభిస్తుంది. మరో ఐదేళ్లు అంటే 25 ఏళ్లకు రూ.80 లక్షలు వరకు సమకూరుతుంది.

చివరిగా: మీకు ఎలాంటి ఆర్థిక అవసరాలు లేకుండా ఉంటే పీపీఎఫ్ ఖాతాలో మెచ్యూరిటీ తర్వాత కూడా పొడిగించడమే మంచిది. అప్పుడే చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందొచ్చు. తక్కువ వయసులోనే ఖాతాను తెరవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

